**భట్టిప్రోలు నాగసుందరి స్మారక సంక్రాంతి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

# అవిటివాడు

## వై. కె. మూర్తి

రోహిణీకార్తె ఎండలు ఎక్కువగా ఉన్నాయి. గాలికోసం డాబామీద పక్కేసుకుని పడుకున్నాను. కొబ్బరి ఆకుల సందుల్లోంచి,, చంద్రుడు చిత్రంగా చూస్తూ చల్లని వెన్నెలను చల్లుతున్నాడు. ప్రశాంత వాతావరణం, నిద్ర ముంచుకొచ్చేసింది. లేచేసరికి తెల్లవారింది.

రెండిళ్ళవతల డాబామీద ఓ అందాల సుందరి, ముద్దులు మూటగట్టే గులాబీ బుగ్గలు, ఉంగరాలజుట్టు ఉన్న రబ్బరు బొమ్మలాంటి పాపనెత్తుకొని వచ్చింది. పాప, ఆమె అందానికి పోటీపడుతున్నారా అన్నట్లున్నారు. అక్కడ పడుకున్నాయన దగ్గరగా కూర్చుందామె. పాప అతడి దగ్గరకెళ్ళింది.

"లేవండి శ్రీవారూ! ఆఫీసుకు సమయమైపోతోంది" అని అతి సున్నితంగా అతన్ని లేపింది.

అతను లేచి ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. నాకు ఒళ్ళు జలదరించింది. తల, కళ్ళు, ముఖం అందంగా ఉన్నా ఛాతీపైకి తన్నుకొచ్చినట్లుంది. కాస్త గూనికూడాను. కాళ్ళు రెండూ కుంటికాబోలు కఱ్ఱసాయంతో పైకి లేచాడు. ఎంతో ఓపిగ్గా పిల్లనెత్తుకుని అతణ్ణి నడిపించుకెళ్తోంది. ఆమె ఆసరాతో మెట్లు దిగుతున్నాడు.

ఆమె, పాప నా మనస్సులో మెదులుతున్నారు. ఈ అష్టావక్రుడికిలాంటి ఆమె భార్యా? ఆమెకెంత ఓర్పో. ఆ దేవుడీ జంటనెలా కుదిర్చాడో! తనకూ పెళ్ళయి ఆరేళ్ళయింది. ఇంతవరకూ పిల్లల్లేరు. తన శ్రీమతి పిల్లల్లేరనే దిగులుతో ఉంది. తనే ఓసారి డాక్టర్ని సంప్రదించుదామా? అన్నాడు. "ఎందుకండీ! మనకు సంతాన యోగం ఉంటే వాళ్ళే పుడ్తారు" అంది కమల.

ఆ కుంటివాడికి పిల్లలనిచ్చాడు కానీ ఆ దేవుడు తనకివ్వలేదు పిల్లల్ని. వాడికి ఆస్తికూడా ఉన్నట్లు లేదు. పైగా కుంటి వాడేం ఉద్యోగం చేసి పోషిస్తాడు. దరిద్రులకు సంతానం ఎక్కువిస్తాడు ఆ దేవుడు అనుకుంటూ క్రిందకెళ్ళాను.

భార్య కమల వాళ్ళ ఊరు వెళ్ళొస్తానని వెళ్ళింది. తనొక్కడే ఇప్పుడు. వారం రోజుల తర్వాత కమల వచ్చింది. కమలది సామాన్యమైన అందం, అయినా ఏదో ఆకర్షణ ఉంది ఆ నవ్వుముఖంలో, అందుకేగా కోరిచేసుకున్నాడు. ఆ రోజు శుక్రవారం. కమల గుడికెళ్ళింది. తనకేమీ తోచక డాబా మీదికెళ్ళాడు. మళ్ళీ ఆ కుంటివాణ్ణి ఓపికగా పైకి తెస్తోందామె. కఱ్ఱ ఆసరాతో పైకి వచ్చాడు. కాకీ నిక్కరు, గూని కనపడకుండా వదులుగా ఉన్న చొక్కా, ఏ మిల్లులోనో వర్కర్ అయి వుంటాడు అనిపించింది. ఇంతలో కమల గుడినుండి ప్రసాదం తీసుకుని వచ్చింది. కుంకుమ తెచ్చింది. "చల్లగా వుంది. కాసేపు కూర్చొని వెళదాం!" అన్నాను. తను తిరిగింది "చూశారా, ఆ కుంటివాణ్ణి అష్టావక్రుడల్లే ఎన్ని వంకరలో. ఆ పిల్లని చూడండి. ఎంత అందంగా ఉందో. ఇలాంటి అవిటివాడికిచ్చి ఆ పిల్ల గొంతుకోసి తల్లిదండ్రులు తమ బరువు బాధ్యతలు తీర్చుకుని, చేతులు దులుపుకుంటారు. కాని ఆ పిల్ల జీవితాంతం బాధపడ్తుందని ఆలోచించరు. ఇష్టమున్నా లేకపోయినా జీవితంతో రాజీపడి పతిదేవుడితో సంసారం చేయడం పవిత్ర భారత స్త్రీల నొసట రాసిన వక్రరేఖల సారాంశం కదండీ!" అన్నది కమల చిన్న లెక్చరిస్తున్నట్లు.

అనుకోకుండా ఇద్దరూ వాళ్ళవైపు చూశారు. అవిటివాడు తన భార్యను దగ్గరకు తీసుకొని చెంపకు చెంప ఆన్చి చల్లని వెన్నెల యిస్తున్న జాబిల్లిని చూపిస్తూ, ఏమిటో చెప్తున్నాడు. ఆమె మల్లెలు విరిసినట్లు కిలకిలా నవ్వుతోంది. కమలకు నోటమాట రాలేదు. క్రిందకు దారి తీసింది. తనూ వెళ్ళాడు. మర్నాడు ఆఫీసుకు బయల్దేరుతూ వాకిట్లోకి వచ్చాను. కుంటి రాజావారు కాకీ నిక్కరు, తెల్లషర్టుతో, కఱ్ఱసాయంతో తమ్ముడు కాబోలు కూడా రిక్షా ఎక్కించుకుని వెళ్తున్నాడు. వీడు నిజంగా మిల్లులో ఉద్యోగిలాగానే ఉన్నాడు అనుకున్నా. కమల తాలూకు పొలం డబ్బేదో తెచ్చి మామగారివ్వడంతో కమల పేర బ్యాంకులో వేయడానికి బ్యాంకుకు వెళ్ళాను. సరాసరి ఏజెంట్ దగ్గరకెళ్ళాను. తను ఎవరినైతే అవిటివాడు, మిల్‌వర్కర్ అనుకున్నాడో ఆ అష్టావక్రుడే అక్కడ ఏజెంట్ సీట్లో కూర్చొనివున్నాడు. నోట మాట రాలేదు తనకి. తమాయించుకుని "రామారావు గారు లేరా అండీ" అన్నాను.

"వారు బందరు బదిలీ అయ్యారు. నేనే ఇప్పు డిక్కడ ఏజెంట్‌ని. మీకేం పని కావాలన్నా నేను చేయించి పెడ్తాను" అన్నాడు ఆత్మీయతతో.

పక్కనే ఏజెంట్ వి.సుందరమూర్తి అన్న పేరు, ఆయన డిగ్రీలు అరడజను చూసి విస్తు పోయాను. అన్ని అవయవాలూ ఉండి బి.ఏ. చదవటానికి చచ్చి సగమై, పార్టులు కట్టి పాసై కలక్టరేట్‌లో క్లర్క్‌గా మిగిలిపోయాడు తను. తనమీద తనకే చిరాకేసింది.

"ఏమండీ ఫిక్సడా?" అన్న సుందరమూర్తి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాను.

"ఆ, ఆ, అవునండీ!" అని పని ముగించుకొని ఇంటికెళుతూ, దారిలో డాక్టరును సంప్రదించిన ఫలితం 'తనకు పిల్లలు పుట్టే అవకాశం లేదనీ, అయినా మళ్ళీ టెస్టు చేస్తానని' చెప్పాడు డాక్టరు.

నిజానికి తనూ "అవిటివాడు" కానీ ఆ మాట తన భార్యతో చెప్పలేక పోయాడు.